
# దాంపత్యంలో ఆత్మదర్శనం



ఆఫీస్ లంచ్ అవర్‌లో తన్నుగూర్చి జరిగిన చర్చే లలిత మనసును అల్లకల్లోలం చేస్తున్నది. గుండెల్లో ఏదో తెలియని వ్యథ సుళ్లు తిప్పుతున్నది. ప్రత్యేకించి మరే విషయంలో తన్ను వాళ్లు విమర్శించినా, పరిహసించినా, తన ఆలోచనలు, అలవాట్ల పట్ల ఉక్రోషం చూపినా, విసుర్లు విసిరినా తనింతగా కుసినారి పోవాల్సిన అగత్యం ఏర్పడి ఉండేది కాదు.

డా॥ పి.వి. రమణ

తన జీవితానికి సారథిగా, కర్తగా, తన భవిష్యత్తుకు భద్రమైన పెన్నిధిలా తను భావించే తన భర్త మీద ఆ విసుర్లు.

మనసులోకి ఆ మాటలు తెచ్చుకొంటున్న కొద్దీ బాధతో, పరితాపంతో హృదయం మరిగి పోతూ ఉంది. మొదట తాను తేలిగ్గా తీసుకొని ఆ విసుర్లు వింటున్నా, వాళ్ల అంతరార్థం పసిగట్టాక, గుండెల్లో వణుకు. మనసులో కోత. నరాల్లో సల సల మరిగే తైలం.

"మీ ఆయనింత బభ్రాజమానమేమే లలితా" సుధ వెక్కిరింపు.

"ప్రపంచ జ్ఞానం బొత్తిగా అలవడకుండా చేయకే లలితా; శుక మహర్షి జాబితాలో కల్సిపోతాడు; నీ కింకా సంతానం గూడా లేదు" అరుణ సలహా; పరిహాసం.

వాళ్ల వెక్కిరింపుల్లో, పరిహాసాల్లో నిజమున్నదేమోవన్న శంక లలితను అదేపనిగ వేధిస్తున్నది. మనసు నిలకడ తప్పుతున్నది. తనింకా మాతృమూర్తి కాలేకపోవటం మనసును కోత కోస్తున్నది. అందుకు తనదేనా అపరాధం !

సుబ్బారావుతో తను జీవితం పంచుకొని నాలుగేండ్లయింది. లాలింపులు, ఊరింపులేగాని, వేరే ఏ విధమైన సాధింపులు, వేధింపులు తానెరుగదు. ఒక్క పరుషమైన మాట గాని, తన కయిష్టమైన పని గాని భర్త నుండి తాననుభవించి ఎరుగదు. తన మనసులోని ఆలోచన బయటకు వచ్చీ రాకముందే కార్యరూపాని కుపక్రమించేవాడు. ఇంటి క్కావాల్సిన వెచ్చాల్నుండి, వేడుకలవరకూ అన్నీ తన సలహామీదనే ! తన తోడుతోనే సుబ్బారావు పాటించేవాడు. ఇంతెందుకు ? తను ఏదిచెప్తే అదే శాసనంగా తీసుకొనేవాడు.

"కేవలం తీపేకాదే; కాస్త కారం గూడా ఉండాలి. లేకపోతే మొహం మొత్తిపోతుంది. మీ ఆయన పాపం తన వ్యక్తిత్వం మరిచి, గంగిరెద్దులా నీ వాడించినట్లల్లా ఆడటం నేర్చుకొన్నాడు."

కమల అన్న మాటల్లో ఆంతర్యమేమిటి ? తను గంగిరెద్దులా భర్తను ఆడిస్తున్నదా ? గానుగెద్దులా పని చేయిస్తున్నదా ? ఇద్దరూ కలిసి ఇంటి పనులు కలగలిపి చేసుకోవటం నేరమా ? మరి దాంపత్యమంటే కొట్లాటలు, కాట్లాటలకు నిలయం కావాలా ?!

"వానచినుకులు భూమి కెంతవసరమో, కన్నీళ్ళూ భామామణి కంతవసరమేనే. లేనప్పుడు సుఖం విలువేం తెలుస్తుందే లలితా."

అరుణ ఎందుకిట్లా పోరుతూంటుంది అస్తమానం. తన్నుకొస్తున్న ఆలోచనల్తో లలిత మనసు వ్యగ్రమవుతున్నది. జీవననది అనురాగ ధారలతో ఏక ప్రవాహమై సాగినప్పుడే కదా బ్రతుకుకు సార్థకత ! అట్లాగాక వీళ్ల వివరిస్తున్నట్లు, విసుర్లు విసురుతున్నట్లు ఆ జీవన ప్రవాహమే పాయలు పాయలై, పడిగలు పడిగలై ఇసుక మేటలువేసి దాంపత్య జీవితం చైతన్య రహితం కావాలా ?

వాళ్ళ ఆంతర్యాలు అర్థమై, అసహ్యం పుట్టిస్తున్నా లలితలోనూ ఏదో తెలియని అశాంతి; ఆమె నరనరాల్లోనూ తీవ్రప్రకంపనం. అమృతమయమనుకొన్న తన జీవితంలోనూ వీళ్ళకు అసమగ్ర రూపాలే కన్పిస్తున్నాయా ? ఆమె నరాలు చిట్లిపోయేటంతగా తీవ్ర చలనం లలితలో. నాలుగున్నరకే ఆఫీసు నుండి పరుగులా బయటకు వచ్చింది లలిత. అందిన బస్సునెక్కి ఇంటికి చేరింది. ఇంటి ముంగిట జామచెట్టు నీడన పడక కుర్చీ వాల్చుకుని నిస్త్రాణగా పడుకొంది. తాముంటున్న ఆ చిన్న ఇల్లే మధురానుభవాల సౌరభాలను గుబాళింపజేసే పొదరిల్లుగా, తొలిపొద్దు రాగరంజిత సూర్యకిరణాల చక్కిలిగింతలకు పరవశించి జాలువారే చిరుమంచు జల్లుగా, భావించింది లలిత. పైకి చూసింది. నీలితెరల మధ్య సమ్మోహన కరంగా ఉన్న ఆకాశం; దానికి మకిలి పూసినట్టు, కాటిక పూతలు పూసినట్టు మబ్బులు; వీళ్ళ విమర్శలు, ఎత్తిపొడుపులు ఆ మబ్బులవంటి వేనేమో ! పవిత్రమైన వైవాహిక బంధాన్ని ఎంత చులకన చేసి మాట్లాడారు ! జీవితాంతం పెనవేసుకొనే అనుబంధాలకు ఎన్ని అడ్డుగోడలు కట్టాలని తాపత్రయపడ్డారు ? హృదయాన్ని గాయపర్చటమంటే తాయిలాలు తిన్నంత ఆనందం వాళ్ళకి; ఏమి జన్మలో ! కణతలు పట్టుకొంది లలిత.

స్కూటర్ ఆగిన శబ్దం. ఆరాటపడుతూ లోనికొచ్చాడు సుబ్బారావు ఒక్క అంగలో గెంతి వచ్చినట్లు. ఉదాసీనంగా, అన్యమనస్కంగా ఉన్న లలితను చూసి ఓ క్షణం ఆశ్చర్యపోయాడు.

"అదేమిటి లలితా; నా కోసం ఆగకుండా వచ్చేశావు; నీ కోసం మీ ఆఫీసు దగ్గర వేటాడి నంతపని జేశాననుకో."

లలిత జవాబివ్వలేదు. ఓ క్షణం నిశితంగా సుబ్బారావు వైపు చూసింది.

ఆ చూపు సుబ్బారావు మనసు లోలోతు పొరల పురివిప్పింది. అతను మరింత ఆశ్చర్య పోయాడు. లలిత చూపులు ఇవి కావు. ఆ చూపుల్లో జన్మజన్మల నుండి తీగ సాగుతూ వచ్చిన అనుబంధాల మధుర ఆకర్షణ లుంటాయి; సిరివెన్నెల జల్లులుంటాయి. జీవన వీణ నుండి పెల్లుబికే సప్తరాగాల స్పర్శ లుంటాయి; పరవశ పరామర్శలుంటాయి; తనకు తెలుసు; ఈ తీక్షణత లలిత వీక్షణాల్లో ఉండదు.

"అట్లా ఉన్నావేం లలితా ?" అనునయంగా అడిగాడు సుబ్బారావు.

"ఎట్లా ఉన్నాను ?"

మరోమారు నివ్వెరపోయాడు సుబ్బారావు లలిత ప్రవర్తనకు; పొడి పొడి మాటలకు. ఇవి లలిత మాటలు కావు. తనకు తెల్సు. పచ్చిక పట్టుల మీద పారాడే చల్లని పవనాల హారతు లుంటాయి ఆ మాటల్లో. రాగాత్మలను మాధుర్యపరిచే మార్ద్రత ఉంటుంది. సంశయాల మధ్య అల్లుకుపోతున్నాడు సుబ్బారావు.

"ఒంట్లో బాగాలేదా లలితా ?" లాలనగా అడిగాడు.

"ఒంట్లో బాగానే ఉంది. మీరిట్లా నా వెంటపడి వేధించటం, వెలితి పర్చటమే బాగా లేదు."

సుబ్బారావు అవాక్కైపోయాడు. అతని అంతరంగంలో ఘోష;

"వేధించానా నిన్ను లలితా ?"

"అవును; అవును; అవును" లలిత మనసును, దాని స్వచ్ఛతను వత్తిపట్టి దూసుకు వచ్చిన మాటలు.

సుబ్బారావులో ప్రాకిపోతున్న ఏదో భయం. ముసుగులా వ్యాపిస్తున్న అయోమయం. లలిత వైపు అర్థంగానట్లు చూశాడు; ఆర్ద్రంగా చూశాడు; ఆందోళనగా చూశాడు; మారు మాట్లాడకుండా వరండాలోకి వెళ్లి కుర్చీలో కూర్చొన్నాడు.

సాయం సంధ్య; కాల గమనంలో మరో మలుపు, అస్తమించబోయే సూర్యుని కొన మెరుపు. ఎంత వదిలేద్దామనుకొన్నా ఆఫీసులో కొలీగ్స్ మాటలు లలిత మనస్సును చుట్టుకొంటూనే ఉన్నాయి. ఆమెను దహించివేస్తూనే ఉన్నాయి. ఆ క్షణంలో సుబ్బారావు పట్ల తాను ప్రవర్తించిన తీరు గాని, అందుకతడు చెందిన నైరాశ్యంగాని, పొందిన వేదన గాని ఆలోచించే స్థితి లలిత కోల్పోయింది. మనసులో మేకులు దిగినట్లు కదలబారి పోయింది లలిత. గుండెను కవ్వంతో చిలికినట్లు కల్లోలపడింది. ఎందుకింత అవమాన పరుస్తూ మాట్లాడారు వాళ్ళు ? అతని అర్ధాంగిని కావటం భాగ్యమనుకొంది. ఈ బ్రతుకంతా అతని చల్లని నీడలోనే సాగిపోవాలని ఆరాటపడింది. భర్త ప్రేమానురాగాల అభిషేకాల మధ్య వేడుకగా జీవించటం తప్పా ? మనసిచ్చిన మనిషితో అల్లుకుపోయి, లేదా హత్తుకుపోయి తిరగటం నేరమా? లలితలో పాదుకుపోతున్న కక్ష; పగ.

బరువైపోతున్న నిశ్శబ్దం. ఆలోచనల తెరల మధ్య, ఆవేదన పొరల మధ్య కరువైపోతున్న మాటలు. ఈ నాలుగేండ్ల తమ దాంపత్య జీవితంలో లలిత ఇట్లా ప్రవర్తించటం మొదటి సారి. సుబ్బారావుకు ఇది విడ్డూరంగానే కాదు, విషాదంగానూ ఉంది. ఈ సమయంలో గాలి కూడా వినరాదన్నంతగా తమ మధ్య సాగే గుసగుసలు; పరస్పరం ఒకరి కళ్ళల్లో ఒకరు ఆర్తితో, ఆరాధనతో దాంపత్య జీవన పరమార్ధ అనుభూతి ముద్రలకై వెతుకులాట. సుబ్బారావు మనసులో సన్నని కోత; సందేహ జలపాతాల హోరు. వరండాలో నుండి లలిత ప్రవర్తనను గమనిస్తున్న

సుబ్బారావుకు ఆమేదో తీవ్ర ఆలోచనల మధ్య, ఆందోళనల మధ్య నలిగిపోతున్నదన్న సత్యం ద్యోతక పడింది. పోనీ, పోయి అనునయిద్దామంటే అన్యమనస్కంగానే కాదు, అసహనంగానూ ప్రవర్తిస్తోంది. ఆ ఉద్రేకంపాలు తగ్గాక, లలితే వచ్చి తన్ను వేధించే విషయం గూర్చి చెపుతుందన్న ఆశతోనే మవునంగా ఉండిపోయాడు.

ఆలోచనల్తో సతమతమవుతున్న లలిత మనసులోనూ మంట; కప్పుకుపోతున్న వేదన. భర్త అన్నవాడు భార్య బాధ్యతల్ని సంపూర్ణంగా స్వీకరించటం తప్పా? తన పురోగమనానికి, భౌతిక జీవనానికి రక్షణగా, భూమికగా, మనసుకు లాలస నిలయంగా, వేయి బంధాలతో, దాంపత్య అనుబంధాన్ని సంధానంగా చేయబోవటం, అదీ ఒక ప్రవక్తగా, ప్రయోక్తగా, పెన్నిధిగా ప్రేమ మూర్తిగా ఆనందపు వెల్లువలను తన జీవితంలో నింపబూనటం ఇతరుల కళ్ళమంటకు కారణమవుతుందా? గుడిలో దీపం వెల్గించే వారిని, జ్ఞానశిఖరంపై నిలిచి దివ్యబోధనలు చేసే వారినీ కూడా విమర్శించటం కొందరి జన్మహక్కేమో! లేదా వారి సంకుచితతత్వ అవనిక మనసు మహా కలశాన్ని ఆచ్ఛాదన చేసి ఉంచుతుందేమో! ఏమో! లలిత కళ్ళల్లో రెక్కలు విప్పుకుంటున్న చీకట్లు. ఆమె నెమ్మదిగా లేచింది. భర్తవైపు

## దాంపత్యంలో ఆత్మదర్శనం

చూసింది. చేతిలో ఏదో పుస్తకమున్నా ధ్యాసంతా తనమీదనే తన భర్త "బ్రభాజమానమా?" అంటే? భార్య కొంగు పట్టుకు తిరిగేవాడనా? లేక ఏ సమర్థతా లేని వాడనా? ఆమెకు సరైన భావం స్ఫురించలే. మొత్తానికి "తన్ను విడిచి ఉండలేడన్న" అర్థంతోనే వాళ్ళా మాటలంది. ఏదో ఒక్కసారి అంటే సరిపెట్టుకోవచ్చు సరదాకు అన్నార్లే అని. ఇప్పటి కెన్నిసార్లు వీళ్ళా విసుర్లు ఆరంభించి? తమ అన్యోన్యతను చూసి ఓర్వలేని ఏడుపు అది. తమ ప్రేమాదరాల కళాత్మక దివ్య జీవనాన్ని చూసి తట్టుకోలేక కక్కే విషమది. ఫూల్స్..., కసితీరా మరోమారు తిట్టుకొంది. ఈ చిన్న విషయానికే తనింత సెన్సిటివ్‌గా ఆలోచిస్తున్నదేమిటి? మానసికంగా తాను ఇంత బలహీనురాలా!

"అరె...ఆయనకు కాఫీకూడా ఈయలేదా" అకస్మాత్తుగా మనసులో కొచ్చి ఉన్న పళంగా ఇంట్లోకి వెళ్ళింది. లలిత పరుగు వరుగు నడక సుబ్బారావును గంద్రగోళ పరిచింది. పలకరించక పోతేమానె, కనీసం కన్నెత్తైనా పరామర్శించక పోవటం అతనికి మరింత బాధ కల్గించింది. ఇంకో రెండు నిముషాలాగి అసలు విషయమేమిటో లలితనే అడుగుదామని తన్ను తాను సముదాయించుకొన్నాడు.

"కాఫీ తీసుకోండి" కాఫీ గ్లాసుతోవచ్చింది లలిత. "మరి నీవు" ఆశ్చర్యపోతూ అన్నాడు సుబ్బారావు. ఇద్దరూ కలిసే కాఫీ త్రాగటం ఆనవాయితీ. దానికి ఇప్పుడు అవరోధం.

"అబ్బబ్బ... ముందీ గ్లాసు అందుకోండి" లలిత మనసులో ఇంకా అసహనపు చారలు

కిక్కురుమనకుండా గ్లాసందుకొన్నాడు సుబ్బారావు. లలిత మాటను అతిక్రమించటం ఏ స్థితిలోనూ అతని కలవాటు లేదు.

"వచ్చి అర్థాంగంటైనా దేవిగారికి ఇప్పటికి దయగలిగింది."

తనలో తాను గొణుక్కుంటున్నట్లుగా అన్నాడు. లలిత ముఖంలో కుదురుకోపోతున్న ప్రశాంతత తిరిగి చెదిరి పోయింది.

"అట్లా దేవిగార్లు, గీవిగార్లు అని పిలవక పోతే మామూలుగా పిలవలేరూ."

సుబ్బారావు తత్తరపడ్డాడు. విచిత్రంగా లలిత వైపు చూశాడు. ఆమెలో గూడుకట్టుకొంటున్న ఆవేదన, నిబ్బరాన్ని చాటు చేసుకున్న అశాంతి ముసుగు వైఫల్యంలో చిక్కుపడిపోయినట్లుగా అర్థంకాని తపన. మొత్తానికి లలితచుట్టూ బాధాతప్తవలయాలు. "ఎక్కుపెట్టిన బాణ


రు. 40,000 విలువచేసే బహుమతులు గెలవండి.



మొదటి బహుమతి
రాజదూత్ మోటార్ సైకిల్ లేదా రు. 9000/- నగదు.



రెండవ బహుమతి
టూ-ఇన్-వన్ స్టీరియో లేదా రు. 4000/- నగదు.

110 కాన్సొలేషన్ బహుమతులు

(i) ఏవన్ మిక్సర్ గ్రైండర్, తగ్గింపు ధర రు. 265/- లేదా
(ii) ఆల్ వరల్డ్ ట్రాన్సిస్టర్ రు. 180/- లేదా
(iii) అమెరికన్ డిజైన్ చీర రు 80/- విలువ చేసేది.



ఈ ప్రకటన ధ్యేయం అమ్మకాలను పెంచటం.

ఈ క్రింద మూడు వరుసల్లో, ఏ పక్కనుంచి కూడినా 57 వచ్చే విధంగా 15 నుంచి 23 వరకే అంకెలను వాడాం.

18 + 23 + 16 = 57 ఉదాహరణకి
17 19 21
22 15 20

మీరు చేయవలసిందల్లా : ఇదే విధంగా ఎటు చూసినా 60 వచ్చే విధంగా, మూడు వరుసల్లో 16 నుంచి 24 వరకూ అంకెలను వాడాలి.

నిబంధనలు :
ఒక కుటుంబం నుంచి ఒకే ఒక ఎంట్రీ మాత్రమే అంగీకరిస్తాం. ఫలితాలు తెలపగానే విజేతలకు తెలియజేస్తాం. యాజమాన్యం వారిది తుది నిర్ణయం. మీ ఎంట్రీలను 10 రోజుల్లో పంపండి. మీ చిరునామాను ఇంగ్లీషులోగాని, హిందీలోగాని మాత్రమే వ్రాయండి.

NATIONAL TRADING CO.
Post Box No. 2715, Karol Bagh, New Delhi-5




భారతి

సాహిత్య మాసపత్రిక

తెనుగువారి
సంస్కృతికి
ప్రతిబింబం

విడి పత్రిక: రూ. 4/-




మేదో'' లలితపట్ల సిద్ధమై ఉందన్న ఆంతర్యం తెలిసొచ్చిందతనికి. దాని పరిణామమేతీరులో ఉంటుందో! సుబ్బారావులో సన్నని వణుకు.

''మార్కెట్ కెళ్దామా? కూరలు తీసుకు రావాలిగా?''

''ఏం అవసరంలేదు. ఈ పూటకు ఊరగాయల్తో సరిపెట్టుకోవచ్చు. రేపుదయం బండివాడొస్తాడు; కావాల్సినవి తీసికోవచ్చు'' నిశ్చలంగా అంది లలిత.

సుబ్బారావు మరోమారు బిత్తరపోయాడు. ఈ సస్పెన్స్‌ను భరించలేనంతగా బేలమై పోయాడు. ఆహ్లాదం, ఆనందం, పారవశ్యం ఈ ఇంటినుండి, అసలు వాతావరణంనుండే మాయమైపోయాయా అన్న సందేహంలో తన్నుకులాడిపోయాడు.

''అది కాదు లలితా; మార్కెట్‌లో మనకు నచ్చిన తాజా కూరలు తెచ్చుకోవటం మామూలుగా మనకు'' తన ధర్మంగా అన్నాడు.

లలిత చివ్వున తలెత్తింది.

''ఏం ఆ ముష్టి కూరగాయలకోసం ఇద్దరం పోయిరావాలా?''

సుబ్బారావు విలవిల్లాడిపోయాడు. భూగోళం మామూలుగా తిరుగుతూందా అన్న సందేహంలో కొట్టుకు మిట్టుకులాడాడు. కొత్త ముద్రలు వేస్తున్నది లలిత. కొత్త స్వరాలతో పలుకుతున్నది. జీవన మాధుర్యానికి, రాగపరిపూర్ణతకు అకారణంగా గండి పడింది. దాంపత్య సౌందర్య లాలస అనుభూతికి, జీవన తన్మయత్వానికి ఎక్కడో గండి పడింది. అసమగ్రత, అశాంతి స్థావరమేర్పర్చుకొంటున్నాయి. ఏమిటో ఈ అకాల గ్రహణం. అగోచరంగా, అస్పష్టంగా ప్రవహించే ఈ అశాంతికి కారణమేమిటో తెల్సుకోలేక కదలబారిపోయాడు. అనేక జీవన రాగ సమ్మోహన స్వరమేళ నాలపించే వీణ తంత్రి ఎక్కడో విచ్ఛిన్నమైంది. ఏదో చట్రంలో ఇరుక్కొని తనకు తెలియకుండానే గిరికీలు కొడుతున్నట్టు కల్లోల పడిపోయాడు. పోనీ, అసలు విషయమేమిటో లలితనే అడిగి తెల్సుకొందామంటే మరింకేం పరిణామాలు సంభవిస్తాయోనని బిగుసుకుపోయాడు.

ఆ రాత్రి... మామూలుగా ... వికసించిన కలువలు పరామర్శించు కొన్నట్లుగా గాక, అరమోసిన కన్నులతో సర్వంమరిచి ఏకస్వరంతో మాట్లాడినట్లుగా గాక, కాలచక్ర పరిభ్రమణాన్ని ప్రక్కకుతోసి హృదయ స్పందనల్ని ఏకం చేసినట్లుగా గాక, ఏవేవో మధురలోక ద్వారాలను తెరిచి, ఆ తేజస్సులో, ఓ జస్సులో లీనమైపోయినట్లుగా గాక, జీవిత పరమార్ధ సంగమగీత మధురాలాపన అన్నట్లుగా గాక...ఎవరికి వారుగా, ఎడ ఎడంగా, రగిలే యోగాగ్నుల్లా, సంబర రహితంగా కాలాన్ని వెళ్లదీశారు ఆ యువ దంపతులు.

ఆ ఉదయం గృహకృత్యాలు యధావిధిగానే జరిగినై. ఏకోన్ముఖమై కాదు. పరస్పర సంస్పర్శనతోకాదు, స్పర్శాపారవశ్యంతో అంత కంటేకాదు. లలిత అనుగ్రహానికి దూరంగా, ఆమె అనురాగానికి తన అంతరంగాన్ని ముడుపు కట్టే అవకాశం లేకుండా, ఏకంగా, శోకంగా గడపడటంతో జీవితం అర్థం లేనిదనిపించింది. నిష్ప్రయోజన మనిపించింది. ఆనంద సీమల్నుండి ఏ అగాధ లోయల్లోకో జారిపడ్డట్లనిపించి కళ్ల నీళ్ల పర్యంతమయ్యాడు సుబ్బారావు.

ఉదయం తొమ్మిదిన్నరకు స్కూటర్ స్టార్ట్‌చేస్తున్నట్లు శబ్దం చేశాడు సుబ్బారావు. అయినా లోపల నుండి బయటకు రాలేదు లలిత. అసలు తన ఉనికినే పొక్కనీయలేదు. ఈ నాలుగు సంవత్సరాల నుండీ స్కూటర్ డ్రైవ్‌చేస్తూ తనూ, వెనుక లలితా కూర్చొని ముచ్చట్లాడుకొంటూ పోవటం, ఆమెను ఆమె ఆఫీసు వద్ద దింపి, తను తనాఫీసుకు వెళ్లిపోవటం రివాజు. మామూలుగా తనకంటే ముందే మెరుపులా స్కూటరు వద్దకు చేరే లలిత, ఈరోజు ఇంకా కదిలి రాకపోవటం సుబ్బారావుకు ఆశ్చర్యంగా ఉంది. ఆందోళనగానూ ఉంది. రెండుసార్లు హారన్ మ్రోగించాడు లలితను ఆహ్వానిస్తున్నట్లుగా. ఆ ఆహ్వానంలో సుబ్బారావు మమేకమై ఉండగానే దూసుకు వచ్చినట్లుగా వచ్చింది. లలిత సుబ్బారావు కన్నుల్లో వ్యాపిస్తున్న కాంతి —

''స్కూటర్ మీద మీరేమీ దింపనవసరం లేదు నేనేం పసిపాపను కాను. మీరు వెళ్ళండి. నేబస్సులో వెళ్తా. సాయంత్రమూ నా కోసం మా ఆఫీసుకు రావద్దు'' దేనికైనా సిద్ధపడాలన్నంత స్థిరత్వం లలిత కంఠంలో.

''బస్సులోనా?'' విలవిల్లాడుతూ అన్నాడు సుబ్బారావు.

''ఏం?''

''ఏం లేదు'' నసుగుతూ. సుబ్బారావు నిదానించి ఓ క్షణం లలిత వైపు చూడటానికే అతనికి భయం వేసింది.

శూన్యహృదయంతో, నిస్తేజంగా భూమిపై విసరబడి ప్రమేయ రహితంగా తిరిగే బొంగరంలా వెళ్ళిపోయాడు సుబ్బారావు స్కూటర్‌మీద.

ఆ సాయంత్రం లలిత దాదాపు ఆజ్ఞాపించి చెప్పినట్లు ఆమె ఆఫీసు వద్ద స్కూటరాపకుండా తిన్నగా ఇంటికొచ్చాడు సుబ్బారావు. లలిత ఇంటి కొచ్చుంటుందన్న ఏదో ఆశ, తలుపుకు తాళం చూసింతర్వాత హరించుకుపోయింది. హతాశుడైనాడు సుబ్బారావు. ఆమె మాట్లాడకపోయినా, ఆగ్రహించినా ఎదురుగా కన్పిస్తేచాలు సుబ్బారావు హృదయం తేజోపూరితమవుతుంది. ఆమె ఆకర్షణ ఎన్నో కోట్ల కాంతికిరణాలను ప్రసారం చేస్తుంది అతనిలో. లలిత దర్శన పారవశ్యంలో లోకమంతా ఓ దివ్యమందిరమే సుబ్బారావుకు. లలిత రాకకు మరికొంత సమయం పడుతుందన్న భావమే అతన్ని కంపింప జేసింది. ఒంటరితనం రాకాశిలా విరుచుకు పడుతున్నట్లనిపించింది. చొక్కాలన్నీ మాసి ఉన్నాయి. రెండు చొక్కాలు తీసికొని, వాషింగ్ సోప్‌తో బాత్‌రూం వైపు నడవబోయాడు సుబ్బారావు. అతని దృష్టి అస్తవ్యస్తంగా మధ్య ద్వారంమీద వేసి ఉన్న లలిత చీరమీద పడింది. అదీ మాసి ఉన్నట్లే అన్పిం

## ఇది మీకు చాలా ఉపయోగం

మీకు "వ్యవహారదర్శిని" అనే తెలుగుపుస్తకం చాలా ఉపయోగం. అందులో ఆస్తికొన్నా అమ్మినా తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యాపార, పరిశ్రమలకెలాంటి లైసెన్సులు తీసుకోవాలి, అన్నిమతాల వివాహ, విడాకుల నిబంధనలు స్త్రీపురుషుల ఆస్తిహక్కులు, చెడ్డవారితో ప్రమాదం రాబోతే పోలీసురక్షణకు ఎవరికెలా వ్రాయాలి, ఇండ్లస్థలాలకెలా ధరఖాస్తు పంపాలి, లాడ్జింగుల్లో వ్యభిచారనిరోధరూల్సు, వాటినుంచి రక్షణ వివరాలు, మీరు తెలుసుకోదగిన అనేక చట్టాలవివరాలు, నోట్లు, దస్తావేజులు, ఒప్పందాలు, పిటీషన్లు, ఫిర్యాదులు ఉత్తరాలు ఎలా వ్రాయాలి, వాటివివిధ నమూనాలు అందున్నాయి. సుమారు 300 పేజీలపుస్తకం. ధర రూ॥ 12. వి.పి. పోష్టుఖర్చు రూ॥ 3. అదనం. దేశసేవ ప్రచురణలు, నెం. 2, ఇందిరానగరు, వెంగలరావునగరు టాంకుసమీపాన హైదరాబాదు-500890కు, మీ ఉపయోగానికి వ్యవహారధర్శిని పుస్తకం ఒకటి వి.పి. పోష్టుద్వారా మీకు పంపించమని నేడే ఉత్తరం వ్రాయండి



నూతన యవ్వనం పొందండి! సంతానవంతులు కండి. చర్మవ్యాధుల నుండి విముక్తులు కండి. హస్త ప్రయోగమువలన కలుగు నరముల బలహీనత, శీఘ్ర స్ఖలనము, అంగము చిన్నదగుట, అవసరకాలమందు అసంతృప్తి, సంతానము లేకపోవుట, సమస్త చర్మవ్యాధులకు అద్భుత చికిత్స! పోస్టుద్వారా చికిత్స కలదు.

"క్యాంపులు" :– ప్రతి ఆదివారం 'భీమవరం' షణ్ముఖ లాడ్జిలో ఉదయం 8 గం. నుండి సాయంత్రం 6–30 గం. వరకు. ప్రతినెల 1 మరియు 16 తేదీలలో 'రాజమండ్రి' హోటల్ అప్సరలో మధ్యాహ్నం 12 గం. నుండి రాత్రి 9 గం. వరకు.

### డా॥ డి. మార్కండేయులు, ఆయుర్వేద భిషక్,

సెక్స్ & స్కిన్ స్పెషలిస్ట్, పార్కురోడ్, *గుడివాడ*-521 301 ★ ఫోన్స్ : 522 & 540.









ఎ.జిస్

## రింగ్ సోలిన్

తామర, చిడుము మరియు ఎగ్జిమా మున్నగు చర్మవ్యాధులకు శ్రేష్ఠమైనది

**SAGSONS CHEMICAL CO.,**
MADRAS-81




చింది. దాన్ని భుజాన వేసుకొని బాత్‌రూంలో ప్రవేశించాడు సుబ్బారావు.

పావుగంట గడిచింది. మనసును నొక్కిపట్టి సలపట పెడుతున్న ఆలోచనల మధ్య, ఆవేదనల మధ్య తన పని తాను చేసుకుపోతున్నాడు సుబ్బారావు.

"ఛీ...సిగ్గులేదు మీకు చీరలు తకటానికి?"

ఎప్పుడొచ్చిందో, బాత్రూంలో సుబ్బారావును ఎప్పుడు గమనించిందో లలిత ప్రశ్నించింది ఉరిమినట్లు. ఉల్క జారినట్లు.

"ఎవరిదో కాదుగా ఈ చీర" నసుగుతూ, నానుతూ సుబ్బారావు.

"నాదైతే మాత్రం... మ గ పు ట క పుట్టలే...?"

లలిత పూర్ణానుగ్రహం లభిస్తుందనుకొన్న సుబ్బారావుకు ఆమె ఛీత్కారం అంతే మోతాదులో అందటంతో అల్లల్లాడి పోయాడు సుబ్బారావు. కనుపించని కవాటాలేవో తన్ను బందీచేసి ఉంచుతున్నాయి. కొట్టుకు మిట్టుకులాడి పోయాడు సుబ్బారావు.

"లేవరేం ఇంక ?" గర్జించినట్లుగా లలిత.

మౌనంగా లేచాడు సుబ్బారావు. "ఏమిటో ఈ ప్రళయం" గొణుక్కొంటూ వరండాలోకి చేరాడు.

కారణం తెలియని, తెల్సుకోలేని, లలితనుండి గ్రహించలేని ఈ అకారణ ఆగ్రహ తుఫాన్ మధ్య బితుకు బితుకుమంటూ వారం రోజులు గడిపాడు సుబ్బారావు. అతని పాలిట ఈ వారం రోజులూ దుర్భరమైనవి; దుస్సహమైనవి. ఎన్నోయుగాలు, ఏకాంతంగా కొండ గుహల్లో కుమిలి కుమిలి కుసినారిపోయినట్లైంది సుబ్బారావు పరిస్థితి. అతని రూపం గూడా దిగిపోయింది.


* * *


"లలితా ... చదువుకొన్న దానివి; నియమబద్ధమైన ఆలోచనలు, ఆశయాలు కలదానివి; నీవు కూడా ఇట్లా అయిపోవటం నాకేం నచ్చ లేదు; పైపెచ్చు కోపంగా గూడా ఉంది."

స్నేహితురాలు శాంత ప్రశాంతంగా అంది లలితతో ఆఫీసు లంచ్ అవర్‌లో.

"నీ వంతు కోపం గూడాకానీ" పేలవంగా, విస్తేజంగా లలిత.

"ఏమిటే చూపేది కోపాలు. ఈర్షతో చచ్చిపోతూ ఎవరో ఏదో వాగారని బంగారంలాటి కాపురంలో కల్లోలం రేపుకుంటావా ? శాంతి స్వరూపుడైన నీ భర్తను కుళ్ళగొడతావా ? నిన్న మార్కెట్‌లో చూశాను మీ ఆయన్ని. ఆయన వాలకం చూసి నా కళ్ళే చెమర్చాయి. ఇప్పటికైనా కళ్ళుతెరు. నీ కాపురం నీవు చేజేతులా రాజేసిన నిప్పును నీవే చల్లార్చుకో" అనునయంగా, వాత్సల్యంగా బోధించింది శాంతి;




"నేనశక్తురాల్నవుతున్నాను శాంతీ. ఏ నిర్ణయమూ తీసుకోలేని అసమర్థురాల్నవుతున్నాను" లలిత కన్నుల్లో నీటిపొర.

"లలితా... ఈ వారం రోజుల్లో నీలో వచ్చిన మార్పు, శారీరకంగా, మానసికంగా నిన్నిట్లా బలహీనపర్చింది. అంతే; నీవెంత స్థిరచిత్తురాలివో నాకు తెల్సు. నీ విజ్ఞతా నాకు తెల్సు. నిన్నింతగా చీకటి మూలల్లోకి విసిరివేసిన ఆ సుధ, అరుణల కాపురాల సంగతి నీకు తెలిస్తే వాళ్ళ మాటలకు నీ వెంత నిరర్థకమైన విలువ ఇచ్చావో నీవే గ్రహించగలవు..."

మౌనంగా శాంతివైపే చూస్తుండిపోయింది లలిత.

"సుధ, అరుణల ఇళ్ళూ మా వీధిలోనే. ఆ ఇద్దరి దాంపత్య బంధాలు కొనఊపిరిలో ఉన్నాయి. సుధకూ భర్తకూ క్షణం పడదు. వాళ్ళు నిత్య కొట్లాటలు,కాట్లాటలు వీధివాళ్లకు వినోదం కల్గించే స్థాయికి చేరినై. పైగా అతను ఇంకో ఆవిడతో వేరే కాపురంగూడా అఘోరిస్తున్నాట్ట. ఇహ అరుణ భర్త అన్ని వ్యసనాలకు దాసోహమైన వ్యక్తి. త్రాగుడు, పేకాట; ఆఫీసు ఎగ్గొట్టి క్లబ్బుల్లోనే కాలక్షేపం. వీళ్ళ కాపురాలు ఎప్పుడు పుటుక్కుమంటాయో తెలీదు. వాళ్ళకు జీవితంలో మిణుకు మిణుకుమంటూకూడా కన్పించని శాంతి, ప్రశాంతి, ప్రేమ, అనురాగాలు, పరస్పర అర్పణలు ఏకోన్ముఖమై నీలో కన్పిస్తుంటే, వాళ్ళు ద్వేషంతో రగులుకుపోయారు. భర్త లాలన, అనురాగం, మమత పరిపూర్ణంగా నీకు లభించటం చూసి నీ ఆనందజ్యోతి నార్పాలని చూశారు. నీ భర్త ఔన్నత్యాన్ని కించపర్చాలని చూశారు. దాంపత్యంలో ఏ విలువలకూ, సంతోషాలకు నోచుకోలేని సుధ, అరుణల మాటలకు లేని గౌరవాన్ని ఇచ్చినట్లుగా ప్రవర్తించావు నీవు. ఇహ కమల సంగతి సరేసరి. మూడు పదులు దాటినా దానికి కళ్యాణయోగం పట్టలేదన్న ఉక్రోషం దానికుండనేఉంది. నీ జీవన ప్రాంగణంలో జిల్లేళ్ళు నాటాలని చూస్తున్న వాళ్ళని సహించి భరించటమే కాకుండా, నిన్ను నీవు శిక్షించుకోవటంద్వారా వాళ్ళకు ఓ పెద్ద పీట వేశావు. ఇంకా ఏం చెప్పాలి నీ వంటి దానికి. నీవిట్లాగే వ్యవహరిస్తే నీ భర్తేకాదు,భగవంతుడుకూడా నిన్నుమెచ్చడు" మార్దవంలో, పరమ శాంతంగా అంది శాంత. లలిత మనస్సులో తీవ్ర సంచలనం. తనచుట్టూ ఏర్పడిన కాంతి వలయాల్ని, చీకటి నిలయాలుగా తనంతటతానే మార్చుకొంది. నిజమే; తన మనస్సులో, ప్రాణంలో, సమస్తంలో అల్లుకు పోయిన భర్తను అశాంతిపాలు జేసింది; ఎందుకు? ఏ ప్రయోజనాన్నాశించి? లలితలో ఎడతెగని ఆలోచనలు.

"ఏమిటే ఇంకా ఆ ఆలోచన. ఇహనైనా ఆ స్వార్థ శక్తుల్ని ప్రతిఘటించి ప్రశాంతంగా ఉండు; నీ జీవితాన్ని, దాంపత్యాన్ని వెనుకటిలా తేజోమయం జేసుకో."

"అది కాదే శాంతీ ..." అర్ధోక్తితో ఆగిపోయింది లలిత.

## అభివృద్ధి

అభివృద్ధి...
నిరోధకత్వం...
స్త్రీ
స్వానిష్ఠత్వం!
పురుషుని
దాసత్వం !
స్త్రీ
సహనం
వీడితే—
పురుషుని
బద్ధకం
పారిపోతుంది.
అభివృద్ధి
పురోగమిస్తుంది.

—డా॥ బిట్టు వేంకటేశ్వర్లు.

"ఊఁ ... చెప్పు."

"నా ప్రవర్తనను ప్రతిఘటించే తెగువా, రోషం ఆయనలో వస్తాయని ఆశపడ్డాను. నన్ను శాసించి, దండించే ఒకానొక సమ్మోహనమైన పౌరుషం, నిశ్చల ధీరత్వం ఆయన్నుండి ఆశించాను. నా వల్ల ఆయన 'శుక మహర్షి'లా మారతారేమోనన్న భయమూ నాకేర్పడింది. అరుణ పరిహాసం చేసినట్లు నా కడుపూ ఇంకా పండలేదు. నా అపరాధంగా ఆ శాపం అట్లా పొందరాదనే వ్యథ చెందాను. ఈ శాపంలో ఆయనా భాగం పంచుకోరాదనే అట్లా ప్రవర్తించాను. కానీ ... ఆయన ఆంతర్యం తెల్సికొన్న నాకు, నేనెంత అజ్ఞానంతో ఆలోచించానో అర్థమవుతూంది. నా చుట్టూరా అల్లుకుపోయి, నా తోటిదే జీవితం అన్నట్లుగా నా ప్రేమలో మునిగిపోయారాయన. నా మనోపరితలం నుండి ప్రక్కకు మళ్ళలేనంతగా నా ఆలోచనలోనూ, ఆనందంలోనూ తన్ను తానుగా కల్పిపోయారు. నేను తోడులేనిదే కనురెప్పను సైతం కదిలించలేరన్న సత్యాన్ని ఈ వారం రోజుల్లో తెల్సుకొన్నాను" నిశ్చలంగా, ప్రశాంతంగా అంది లలిత.

"ఇందుకు నీవు గర్వపడాలి. నీ దాంపత్య దివ్యస్థితికి పొంగిపోవాలి. సంతానానికి అప్పుడే తొందరేముంది లలితా ..." అంటున్న శాంతి మాటలు వింటూనే వడివడిగా ఆఫీసు వైపు నడిచింది. ఆఫీసర్ పర్మిషన్ తీసికొని బయటికొచ్చి సుబ్బారావు ఆఫీసు వైపు బయలుదేరింది ఆటోలో లలిత. లలితలోని ఆనందం ఇప్పుడు అవ్యక్తం. మనసులోని ప్రశాంతతకు పరిధుల్లేవు. సుబ్బారావు కూడా ఆఫీసర్ పర్మిషన్ తీసికొని లలితతో ఇంటికి చేరాడు

తనను చుట్టచుట్టుకొని, అల్లుకుపోయి, అణువణువులోనూ ఆత్మదర్శనం చేయిస్తున్న లలితను చూసిన సుబ్బారావుకు మళ్ళీ బ్రహ్మానందస్థితి గోచరించింది. భూమి, స్వర్గం సంధానం చెందినట్లనిపించింది. ★